https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 350 మంగళవారం 31-3-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

## ఆయుధాలు వీడని వారి అంతు చూస్తాం

**లోక్‌సభ వేదికగా**

**మావోయిస్టులకు అమిత్ షా వార్నింగ్**



**ఢిల్లీ,మార్చి 30:** మావోయిస్టులపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్టేట్‌మెంట్ ఇచ్చారు. మావోయిస్టుల ఏరివేతకు మార్చి 31 డెడ్ లైన్ అని తెలిపారు. బస్తర్‌లో ప్రస్తుతం మావోలు లేరని.. మావోయిస్టు రహిత ప్రాంతంగా మారిందని వెల్లడించారు. బస్తర్‌లో ఆదివాసీలకు ప్రస్తుతం అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. అభివృద్ధి దిశగా బస్తర్ ప్రాంతం ముందుకెళ్తోందని తెలిపారు. మావోల లొంగుబాటుకు మంగళవారం ఆఖరి తేదీ అని.. అభివృద్ధి లేదంటూ ఆయుధాలు పట్టుకోవడం సరికాదని హితవుపలికారు అమిత్ షా. ఆయుధాలు వీడని వారి అంతు చూస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలో విలీన ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారని.. కాంగ్రెస్ పాలనలోనే గిరిజన ప్రాంతాలు ఎందుకు అభివృద్ధి చెందలేదని ప్రశ్నించారు. వారి పాలనలో బస్తర్ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని.. గిరిజనులను 60 ఏళ్లపాటు కాంగ్రెస్ విస్మరించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ నిర్వాకం వల్లే దేశంలో మావోయిజం పెరిగిందని కేంద్ర హోంమంత్రి ఆరోపించారు. మావోయిజం వల్ల 12 రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడిందని అమిత్ షా ధ్వజమెత్తారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని.. తమ వల్లే నక్సల్స్ విముక్త భారత్ సాధ్యమవుతోందని లోక్‌సభ వేదికగా కేంద్ర మంత్రి ప్రకటించారు.

# కేసీఆర్ వల్లే నాకు గుర్తింపు!

## రావణాసురుడి వల్ల రాముడికి పేరొచ్చిన మాదిరిగానే..

- పాముకన్నా ప్రమాదకారి హరీశ్‌రావు
- కేసీఆర్‌ను గృహనిర్బంధం చేశారని అనిపిస్తోంది
- పంటల మార్పిడిపై రైతుల్లో చైతన్యం తెస్తాం
- మంత్రులు, వర్సిటీలు, స్వచ్ఛంద సంస్థలకు బాధ్యత
- సన్నబియ్యంపై ఏటా రూ.15,000 కోట్లు పెడుతున్నాం
- భారం పంచుకుంటే మోదీ ఫొటో పెట్టేందుకు సిద్ధం
- పప్పులు పండించండి.. కొని రేషన్‌లో పంచుతాం
- రాష్ట్రంలో అందరికీ క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తాం
- మీడియాతో 'చిట్‌చాట్'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, మార్చి 30** కేసీఆర్ వల్లనే తనకు గుర్తింపు వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రావణాసురుడు లేకుంటే శ్రీరామునికి పేరు వచ్చేదే కాదన్నారు. శనికి పాత్ర లేకుంటే మహాభారత యుద్ధం జరిగుండేది కాదని, శ్రీకృష్ణుడికి గుర్తింపు వచ్చుండేదీ కాదని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు, తనకు పోలికే లేదన్నారు. వరి వేస్తే ఉరి అని కేసీఆర్ అంటే.. తాను సన్న వరి వేసిన రైతులకు బోనస్ ఇస్తున్నానని చెప్పారు. తాను హామీ ఇచ్చినవి చేసుకుంటూ వస్తున్నానని, కేసీఆర్ ఎప్పుడూ చెప్పింది చేయలేదని అన్నారు. కేసీఆర్ ఫామ్ హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారంటూ బీఆర్ఎస్ నేతలు చెబుతున్నప్పటికీ హరీశ్‌రావు, కేటీఆర్‌లు కలిపి ఆయన్ను గృహనిర్బంధం చేసిఉంటారని తాను అనుమానిస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. దారిన వెళుతున్నపుడు తాచుపాము, హరీశ్‌రావులు ఎదురొస్తే పాము కంటే హరీశ్‌రావే ఎక్కువ ప్రమాదకరమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. శాసనమండలి కాన్ఫరెన్సు హాల్లో సోమవారం ఆయన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆహార కల్తీని ఉక్కుపాదంతో అణచి వేయనున్నట్లు ప్రకటించారు. ఆహారంలో కల్తీని అరికట్టేందుకు ఈగల్, హైడ్రాల తరహాలో ప్రత్యేక వ్యవస్థను తీసుకురానున్నట్లు చెప్పారు. దేశంలోని చట్టాలను అధ్యయనం చేసి ఈ వ్యవస్థను పగడ్బందీగా ఏర్పాటు చేస్తామని అన్నారు. రాష్ట్రంలో పంటల మార్పిడి జరగాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అయితే, పంటల మార్పిడి పైన రైతుల్లో అవగాహన కల్పిస్తామే తప్ప కేసీఆర్ తరహాలో ఒత్తిడి చేయబోమని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల మంత్రులు, వ్యవసాయ వర్సిటీ, ఇతర ఎన్జీవోలతో టాస్క్ ఫోర్స్ కమిటీని వేసి, ఆ కమిటీ నివేదికల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.

మిగతా 2లో...

## కేంద్ర నిధులు పంచాయతీలకు అందట్లేదు

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**



**హైదరాబాద్, మార్చి 30:** పదిహేనవ ఆర్థిక సంఘం ద్వారా పంచాయతీల కోసం కేంద్రం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని ముందు నుంచే బీజేపీ చెబుతోందని ఆ పార్టీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రాలకు విడుదల చేసిన నిధులను దారి మళ్లించకుండా వెంటనే గ్రామపంచాయతీలకు విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ సోమవారం చలో అసెంబ్లీ నిర్వహించింది. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం ద్వారా విడుదల చేసిన సుమారు రూ. 640 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు చేరకుండా దారి మళ్లిస్తోందని తెలిపారు. కేంద్రం విడుదల చేసిన నిధులను దారి మళ్లించకుండా వెంటనే పంచాయతీలకు విడుదల చేయాలని సీఎంను కోరారు.

## పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

- మైనింగ్, కబ్జాలపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వినతి
- వట్టినాగులపల్లి భూమిని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు
- సతీష్ షా ఇంటికి మంత్రి పొంగులేటి ఎందుకెళ్లారు?
- రూ.1300కోట్ల భూమిని లాక్కునే యత్నం: కేటీఆర్




**హైదరాబాద్,మార్చి 30** అక్రమ మైనింగ్, భూ కబ్జాలకు పాల్పడుతున్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విజ్ఞప్తి చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్య నేతలు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, వివేకానంద గౌడ్, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సోమవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన 'రాఘవ కన్స్ట్రక్షన్స్' అనే కంపెనీ మైనింగ్ నిబంధనలను ఉల్లంఘించి, జంట జలాశయాల పరిధిలో మైనింగ్ చేస్తోందని తెలిపారు. ఈ అంశంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి, కేంద్ర ప్రభుత్వ సంస్థలతో విచారణ జరిపించాలని గవర్నర్‌ను కోరారు. ఇదిలా ఉండగా, వట్టినాగులపల్లిలో విలువైన భూమిని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబం ఆక్రమిస్తోందని ఆరోపిస్తున్న బీఆర్ఎస్ నేతలు.. సోమవారం ఆ స్థల పరిశీలనకు వెళ్లారు. ఈ క్రమంలో అక్కడ హై డ్రామా చోటు చేసుకుంది. కేటీఆర్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేస్తారన్న సమాచారంతో హరీశ్ రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆయన ఇంటికి చేరుకున్నారు. మరోవైపు సైబరాబాద్ పోలీసులు కూడా పెద్దఎత్తున కేటీఆర్ ఇంటికి చేరుకోవడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది.

మిగతా 2లో...

# పేదింటి పండగ..

## రాష్ట్రవ్యాప్తంగా 2.5 లక్షల ఇళ్ల పంపిణీ.. 2029 నాటికి పేదలందరికీ ఇళ్లు : సీఎం




**తిరుపతి, మార్చి 30** ప్రతి పేద కుటుంబానికీ శాశ్వత ఇల్లు నిర్మించి ఇవ్వాలనేది తన సంకల్పమని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖలో ప్యాలెస్ కట్టుకున్న వ్యక్తి పేదవాడికి ఇల్లు కట్టించి ఇవ్వడానికి ఆనాడు మీనమేషాలు లెక్కించాడంటూ మాజీ సీఎం జగన్‌పై ధ్వజమెత్తారు. సోమవారం తిరుపతి జిల్లా నాయుడుపేటలోని పుదూరు వద్ద టిడ్కో ఇళ్ల సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించి, ఇళ్ల తాళాలు అందజేశారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన సభలో మాట్లాడారు. తిరుపతి జిల్లాలో సొంతిళ్లలోకి అడుగు పెడుతున్న 15,659 మంది పేదల కళ్లలో ఆనందం చూడటం అదృష్టంగా భావిస్తున్నానని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఏపీ టిడ్కో ద్వారా ఒక లక్ష ఇళ్లు, హౌసింగ్ కింద 1.50 లక్షలు నిర్మించి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. "2014-19 మధ్య 8,19,853 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాం. కూటమి ప్రభుత్వం వచ్చాక, గత 21 నెలల్లో పేదలకు ఇళ్ల పంపిణీ ఇది రెండోసారి. గత ఏడాది నవంబరులో మూడు లక్షల మందికి ఇళ్లు అందించాం. ఇప్పుడు 2.50 లక్షల మంది ఒక్కరోజే గృహ ప్రవేశాలు చేశారు. ఇది ఓ చరిత్ర. 2029 నాటికి ఇల్లు లేని ప్రతి ఒక్కరినీ సొంతింటివారిని చేసే బాధ్యత నాది" అని ఆయన వెల్లడించారు. వైసీపీ ఐదేళ్ల కాలంలో కేవలం 6.55 లక్షల ఇళ్లు కట్టగా, రెండేళ్ల లోపే 5.50 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చామని సీఎం పేర్కొన్నారు. డిసెంబరు నాటికి మరో 4.50 లక్షల ఇళ్లను నిర్మించి పంపిణీ చేస్తామని ప్రకటించారు. "గత ప్రభుత్వంలో ఎన్టీఆర్ హౌసింగ్ 4.73 లక్షల ఇళ్లు రద్దు చేశారు. 2.73 లక్షల మంది పేదలు ఇళ్లు నిర్మించుకుంటే డబ్బులు ఇవ్వకుండా రూ.920 కోట్లు ఎగ్గొట్టారు. నేను ప్రారంభించాను కాబట్టి వాటిని విధ్వంసం చేయాలని వారు భావించారు" అని దుయ్యబట్టారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..


### ఏప్రిల్ నుంచి తనిఖీలు

2029కి అందరికీ ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పుడు ఇచ్చే ఇళ్లు కాకుండా మరో 17.60 లక్షలు ఇవ్వాల్సి ఉంది. ఇందులో జూన్ నాటికి 2.70 లక్షలు, సెప్టెంబరు నాటికి 1.62 లక్షల ఇళ్లు పూర్తిచేస్తాం. ఇంకా 12 లక్షలు ఉంటాయి. అవి కూడా కట్టించే బాధ్యత నాది. ఇంటి జాగాలేని వారికి జాగా ఇస్తాం. పట్టణ ప్రాంతాల్లో 2, గ్రామీణంలో 3సెంట్ల చొప్పున ఇచ్చి బ్రహ్మాండమైన కాలనీలు కట్టించి ఇస్తాం. అధికారుల తీరును తెలుసుకునేందుకు ఏప్రిల్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా స్వయంగా తనిఖీలు చేపడతా. తాగునీటిని కుళాయి ద్వారా అందించే కేంద్ర పథకాన్ని ఆనాడు అస్తవ్యస్తం చేశారు. ఈ పథకం కోసం రూ.28వేల కోట్లు కేంద్రం మంజూరు చేయగా, 2 వేల కోట్లే ఖర్చు చేశారు.

మిగతా 2లో...

## ఇరాన్ ఒప్పందానికి రాకుంటే ఖార్గ్‌ను పేల్చేస్తాం

**చమురు బావులు, విద్యుత్ కేంద్రాలను కూడా!**



**వాషింగ్టన్, టెహ్రాన్:** ఇరాన్ గనక తమతో త్వరలో ఒప్పందం కుదుర్చుకొని, హోర్ముజ్ జలసంధిని తెరవకపోతే.. ఆ దేశానికి అత్యంత కీలకమైన ఖార్గ్ దీవిని, చమురు బావులను, ఇరాన్ విద్యుదుత్పత్తి కేంద్రాలను పేల్చేస్తామని, సర్వనాశనం చేసేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోమవారం హెచ్చరించారు. ఈ మేరకు తన సొంత సోషల్ మీడియా 'ట్రూత్ సోషల్'లో ఆయన ఒక పోస్టు పెట్టారు. "ఇరాన్‌లో మా సైనికచర్యను ముగించడానికి.. ఒక కొత్త, మరింత హేతుబద్ధమైన ప్రభుత్వంతో అమెరికా చర్చలు జరుపుతోంది. ఈ చర్చల్లో గొప్ప పురోగతి కనిపిస్తోంది. ఒకవేళ ఏదైనా కారణం చేత ఒప్పందం త్వరలో కుదరకపోతే (కుదిరే అవకాశం ఉంది).. వాణిజ్య కార్యకలాపాల నిమిత్తం హోర్ముజ్ జలసంధి తక్షణం తెరుచుకోకపోతే.. మేం ఇంతవరకూ తాకని వారి (ఇరాన్) విద్యుదుత్పత్తి కేంద్రాలను, చమురు బావులను, ఖార్గ్ దీవిని, ఉప్పునీటిని మంచినీరుగా మార్చే అన్ని డీశాలినైజేషన్ కేంద్రాలను పేల్చివేసి, పూర్తిగా నాశనం చేసి.. ఇరాన్‌లో మా గొప్ప బసను ముగిస్తాం" అని ఆయన ఆ పోస్టులో పేర్కొన్నారు. గత 47 ఏళ్ల భీకర పాలనలో ఇరాన్ అత్యంత క్రూరంగా చంపేసిన అమెరికన్ సైనికులు, ఇతరుల మరణాలకు ఇది ప్రతీకారం అని వివరించారు. అంతకు ముందు పెట్టిన మరో పోస్టులో.. "ఇరాన్‌లో ఇది చాలా పెద్దరోజు. ఆ దేశంలోని.. 'చాలాకాలంగా వేచిచూస్తున్న అనేక లక్ష్యాల'ను ప్రపంచంలోనే అత్యుత్తమమైన, అత్యంత శక్తిమంతమైన, మా గొప్ప సైన్యం తుడిచిపెట్టింది" అని ట్రంప్ పేర్కొన్నారు.

మిగతా 2లో...

## డ్రగ్స్ కేసు నిందితుల కస్టడీపై నేడు తీర్పు

**మొయినాబాద్ మార్చి 30** మొయినాబాద్ ఫామ్‌హసలో కాల్పులు, డ్రగ్స్ కేసులో నిందితులను మరోసారి కస్టడీకి ఇవ్వాలంటూ కోర్టులో పోలీసులుదాఖలు చేసిన పిటిషన్‌పై రాజేంద్రనగర్ కోర్టు సోమవారం మరో సారి విచారణ చేపట్టింది. పోలీసుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ రోజురోజుకు కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నందున ప్రధాన నిందితులను అయిదు రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న న్యాయస్థానం నిర్ణయాన్ని మంగళవారానికి వాయిదా వేసింది. కాగా, డ్రగ్స్ కేసు విచారణలో మరిన్ని గోవా లింకులు బయటపడుతున్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ బృందం ఇటీవల జూబ్లీహిల్స్‌కు చెందిన వైద్యుడు కోలా బాలాజీ పటేల్‌ను అదుపులో తీసుకుని ప్రశ్నించినప్పుడు మరికొన్ని విషయాలు వెల్లడయ్యాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. రోహిత్‌రెడ్డితో సంబంధాలు ఉన్న బాలాజీ గోవా నుంచి డ్రగ్స్ తీసుకువస్తున్నట్లు తేలింది. రోహిత్‌రెడ్డి మరికొందరు స్నేహితులతో వీకెండ్ పార్టీల్లో డ్రగ్స్ తీసుకుంటున్నట్లు విచారణలో బయటపడింది.

## శాసనమండలికి నితీశ్ రాజీనామా

**ఏప్రిల్ 14 తర్వాత సీఎం పదవికి గుడ్‌బై**

**పట్నా, మార్చి 30:** బిహార్ శాసన మండ లి సభ్యత్వానికి ఆ రాష్ట్ర సీఎం, జేడీయూ అధ్యక్షుడు నితీశ్‌కుమార్ సోమవారం రాజీనామా చేశారు. త్వరలో ముఖ్యమంత్రి పదవికి కూడా ఆయన రాజీనామా సమర్పిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. బిహారీలు పవిత్రంగా భావించే ఖార్మాస్ నెల (ఏప్రిల్ 14వ తేదీన) పూర్తి అయిన తర్వాత నితీశ్ సీఎం పదవికి రాజీనామా చేస్తారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

నితీశ్ ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన విషయం తెలిసిందే. ఎన్డీఏలో భాగస్వామ్యపక్షాలైన బీజేపీ, జేడీయూల మధ్య కుదిరిన అవగాహన మేరకే.. నితీశ్ పెద్దల సభకు వెళ్తున్నారని, రాష్ట్ర పగ్గాలు బీజేపీకి చెందిన నేత చేపట్టనున్నారన్న విశ్లేషణలున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటై, నితీశ్ పదోసారి సీఎంగా ప్రమాణం చేసి కేవలం 4 నెలలే అయ్యింది. కాగా, నితీశ్ రాజీనామా పట్ల ప్రజలు సంతోషంగా లేరని బిహార్ శాసన మండలి చైర్మన్ అవధేశ్ సింగ్ అన్నారు. నితీశ్ స్థానంలో ప్రస్తుత డిప్యూటీ సీఎం, బీజేపీ నేత సామ్రాట్ చౌదరి పగ్గాలు చేపట్టే అవకాశాలున్నాయి.

రాష్ట్రంలో ప్రముఖ బీసీ వర్గాల్లో ఒకటైన కొయిరీ సముదాయానికి చెందిన సామ్రాట్ చౌదరికి సీఎం పదవిని అప్పగించటం ద్వారా.. ఆ వర్గం మద్దతు సంపాదించుకోవచ్చని బీజేపీ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. సీఎం రేసులో కేంద్ర మంత్రి నిత్యానందరాయ్ పేరు కూడా వినిపిస్తోంది.



## కేసీఆర్ వల్లే నాకు గుర్తింపు!

(మొదటిపేజీ తరువాయి)

దళారుల దోపిడీని అరికట్టేందుకు కనీస మద్దతు ధర చట్టాన్ని గత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. నిత్యావసరాలను బ్లాక్ మార్కెట్ చేయకుండా పీడీ చట్టలనూ తెచ్చిందని ప్రస్తావించారు. చౌక దుకాణాల ద్వారా కిలో బియ్యం రూ.1.90కి పంపిణీ పథకాన్ని 1982లో మొదటగా తీసుకువచ్చింది విజయభాస్కర్‌రెడ్డి ప్రభుత్వమేనని చెప్పారు. తర్వాత వచ్చిన ఎన్టీఆర్ రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని కొనసాగించారని, అది ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లిందని వివరించారు. గత 40 ఏళ్లుగా చౌక దుకాణాల ద్వారా కేవలం దొడ్డు బియ్యం ఇస్తూ వస్తున్నారని ముఖ్యమంత్రి చెప్పారు. ధరల్లో మార్పులు వచ్చాయే కానీ.. నాణ్యతలో మాత్రం రాలేదన్నారు. దొడ్డు బియ్యం ఇవ్వడం వల్ల పేదలకు ఉపయోగం లేదని గుర్తించిన తమ ప్రభుత్వం పేదలు తినగలిగే సన్నబియ్యం పథకాన్ని గతేడాది మార్చి 30న ఉగాది సందర్భంగా ప్రారంభించినట్లు గుర్తు చేశారు. రైతులు సన్న బియ్యం వడ్లు పండించడం కోసం క్వింటాలుకు రూ.500 చొప్పన బోన్‌సనూ ఇచ్చి ప్రోత్సహించామని చెప్పారు. సన్నబియ్యం వడ్లు పండించిన రైతులకు రెండు పంటలకు కలిపి ఎకరాకు సరాసరి రూ.25 వేల చొప్పున బోనస్ చెల్లిస్తున్నామని వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో సన్న వడ్ల పంట 60 శాతం మేరకు పెరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సన్నబియ్యం పథకం ద్వారా 3.39 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని వివరించారు. రాష్ట్ర జనాభాలో 86 శాతం మందికి సన్నబియ్యం అందుతోందని, రేషన్ కార్డుల మంజూరును నిరంతరంగా కొనసాగిస్తున్న నేపథ్యంలో 90 శాతానికీ భవిష్యత్తులో చేరనుందని చెప్పారు. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా కూడా తగ్గిందని, మార్కెట్లో సన్నబియ్యం ధర స్థిరీకరణా జరిగిందని వివరించారు.

### పంటల మార్పిడి అవసరం

విద్యలో నాణ్యత, నైపుణ్యాలను పెంచడం, భోజనంలో పౌష్టికాహారం తీసుకురావడమే తమ తదుపరి లక్ష్యమని ముఖ్యమంత్రి చెప్పారు. సన్న బియ్యం ఒక్కదారితోనే ప్రజలకు పౌష్టికాహారం అందదని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే రైతులు పంటల మార్పిడి దిశగా కదలాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లాలోని ఒక ఊరిలో రైతులు ఒకే రోజు71 మారుతీ కార్లను కొన్నారని, వాణిజ్య పంటలు పండించడమే దీనికి కారణమని చెప్పారు. రాష్ట్రంలో భూములు వాణిజ్య పంటలు పండించడానికి అత్యంత అనుకూలమని ముఖ్యమంత్రి అన్నారు. ఖమ్మంలో పత్తి, మిర్చి.. నల్లగొండలో వరి, జొన్న, మహబూబ్‌నగర్‌లో సజ్జలు, జొన్నలు, కందులు, ఉమ్మడి రంగారెడ్డిలో పండ్ల తోటలు పండుతాయని సీఎం ప్రస్తావించారు. పంటల మార్పిడిని ప్రోత్సహించాలని నిర్ణయించామని చెప్పారు. రైతులు పప్పు ధాన్యాలను పండిస్తే వాటిని ప్రభుత్వం సేకరించి పప్పుగా మార్చి చౌక దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేస్తుందని ప్రకటించారు. రాష్ట్ర అవసరాలకు సరిపడా పాలు, గుడ్లు వంటివి ఇక్కడ ఉత్పత్తి కాకపోవడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఇదంతా ఒక్క రాత్రిలో మారిపోదని ముఖ్యమంత్రి అంగీకరించారు. పంటల మార్పిడి విషయంలో ప్రభుత్వం రైతులపై ఒత్తిడి తేబోదని స్పష్టం చేశారు. వారంతట వారే పంట మార్పిడి చేసుకునేలా అవగాహన, చైతన్యం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతం.. ఏ పంటకు అనుకూలం అన్నదానిపై అధ్యయనం చేయిస్తామని చెప్పారు. ఆహార కల్తీని అరికట్టేందుకు ఈగల్, హైడ్రా తరహాలో ప్రత్యేక వ్యవస్థను తీసుకువస్తామన్నారు. పేదలకు కల్తీలేని, పౌష్టికాహారం అందించడం ద్వారా జబ్బులు రాకుండా ఆపాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. ప్రతి పనినీ తాము సంతృప్త స్థాయిని లక్ష్యంగా పెట్టుకుని చేస్తున్నట్లు చెప్పారు. సన్నబియ్యం పథకం కోసం ఏటా రూ.15 వేల కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అందరికీ క్యాన్సర్ పరీక్షలూ నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. సన్నబియ్యంలో కోతలు ఉండబోవని, రూ.500కి గ్యాస్ పథకంలో ఎలాంటి మార్పులు చేయబోమని చెప్పారు. చౌక దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీకి కేంద్రం తన వాటా నిధులు ఇస్తోందే కానీ.. సన్న బియ్యం పథకానికి కాదని గుర్తు చేశారు. సన్నబియ్యం పథకానికీ వారు నిధులు ఇస్తే ఈ పథకంలో మోదీ ఫొటో పెట్టడానికి తమకు అభ్యంతరం ఏమీ లేదన్నారు.

**సీఎం మానస పుత్రిక: మంత్రి ఉత్తమ్**

పేదలకు సన్నబియ్యం పంపిణీ పథకం సీఎం రేవంత్‌రెడ్డి మానస పుత్రికని, ఈ పథకం క్రెడిట్ పూర్తిగా ఆయనకే దక్కుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వానికి ఎంత భారమైనా పేదలకు మేలు చేయాలన్న ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకు వచ్చామని చెప్పారు. సన్నబియ్యం నాణ్యతపైఇంతవరకు రాష్ట్రంలో ఎలాంటి ఫిర్యాదూ రాలేదన్నారు. సోనియాగాంధీ తీసుకువచ్చిన ఆహార భద్రతా చట్టానికి తెలంగాణలో ప్రస్తుతం న్యాయం జరుగుతోందన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన 48 గంటల్లో వారి ఖాతాలో డబ్బులు వేస్తున్నట్లు తెలిపారు.

## పొంగులేటిని.. (మొదటిపేజీ తరువాయి)

చివరకు కేటీఆర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేల బృందం వట్టినాగులపల్లి చేరుకున్నారు. అక్కడ వివాదంలో ఉన్న భూమిని పరిశీలించారు. భూ యజమానితో నేరుగా మాట్లాడారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుమారుడు ఈ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. భూ వివాదంపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన గచ్చిబౌలి సీఐని ఎందుకు బదిలీ చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వట్టినాగులపల్లిలోని 27ఎకరాల భూమి... అరవై ఏళ్లుగా సతీష్ షా, అతని భార్య, పిల్లల పేరుపై ఉందన్నారు. రోడ్డు కోసం స్థలం కావాలంటూ పొంగులేటి, ఆయన కొడుకు పలుమార్లు సతీష్ షా ఇంటికి వెళ్లారని ఆరోపించారు. లేనిపోని వివాదం సృష్టించి భూమిని లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని, ప్రహరీ సైతం కూల్చివేశారని విమర్శించారు. రూ.1300కోట్ల విలువైన భూమిని తమకే ఇవ్వాలంటూ యజమానులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, భూమి ఇవ్వకుంటే సజీవంగా పాతిపెడతామని బెదిరిస్తునానరని ధ్వజమెత్తారు. పొంగులేటికి భూమి అవసరం లేకుంటే రెండుసార్లు సతీష్ షా ఇంటికి ఎందుకు వెళ్లారో చెప్పాలని సవాల్ విసిరారు. ఏడీ సర్వేని అడ్డు పెట్టుకుని భూముల హద్దులను మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తమ కుటుంబానికి సంబంధించిన భూ వివాదాన్ని ఎందుకు రాజకీయం చేస్తున్నారో అర్థం కావడం లేదని అవినవ్ షా, సుధీర్ కుమార్‌షా, అక్షయ్ షా ఆవేదన వ్యక్తం చేశారు.

# ఆపరేషన్ కగార్‌కు.. నేడే చివరి రోజు!

- నేటితో ముగియనున్న అమిత్‌షా డెడ్‌లైన్ - అజ్ఞాతంలోనే అగ్రనేతలు గణపతి, బెస్రా, నరహరి
- మొత్తంగా100 మంది నక్సల్స్ ఉన్నట్లు గుర్తింపు - వారికోసం అడవులను జల్లెడ పడుతున్న బలగాలు
- వీరంతా పట్టుబడితేనే ఆపరేషన్ కగార్ పరిపూర్ణం - గణపతి లొంగిపోతే వైద్యం అందిస్తాం: డీజీపీ



**చర్ల, మార్చి 30** దేశంలో మావోయిస్టులను, నక్సలైట్ ఉద్యమాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ గడువు నేటి (మార్చి 31)తో ముగుస్తోంది. అయితే, ఇప్పటికీ పలువురు కీలక మావోయిస్టు నేతలు అజ్ఞాతంలోనే ఉండటంతో.. ఆపరేషన్ కగార్ అసంపూర్తిగానే మిగిలింది. వేలమంది బలగాలతో అడవులను జల్లెడ పడుతున్నా కేంద్ర కమిటీ సభ్యులు గణపతి, మిసెల్ బెస్రా, పసునూరి నరహరి తదితర నేతల ఆచూకీ లభించలేదు. వారిని పట్టుకునేందుకు వివిధ రాష్ట్రాల్లో సుమారు 10 వేల మంది బలగాలు అడవుల్లో అవిశ్రాంతంగా గాలిస్తున్నాయి.

**కగార్‌కు బీజం ఇలా..**

2004 నుంచి 2021 వరకు దండకారణ్యంలో మావోయిస్టులదేపై చేయిగా ఉంది. ఆ ఏడాది మార్చి 21న బీజాపూర్ జిల్లా తెర్రం అడవుల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలపై మావోయిస్టు నేత హిడ్మా బృందం దాడిచేసి 21 మందిని హత్య చేసింది. ఆ ఘటన తర్వాత దేశంలో మావోయిస్టులు లేకుండా ఏరివేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా శపథం చేశారు. రెండేళ్ల తర్వాత ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు 225 ఎన్‌కౌంటర్లు జరగ్గా, సుమారు 490 మంది మావోయిస్టులు మృతి చెందారు. 2,550 మంది లొంగిపోయారు. 1,813 మంది అరెస్టయ్యారు. ఎన్‌కౌంటర్లలో 41 మంది జవాన్లు కూడా మృతి చెందారు. దేశంలో మావోయిస్టు పార్టీ దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. ఆపరేషన్ కగార్ ప్రారంభమైనప్పుడు మావోయిస్టు పార్టీలో 14 మంది కేంద్ర కమిటీ సభ్యులున్నారు. ఆ తర్వాత జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో పార్టీ చీఫ్ బసవరాజు, చలపతి, వివేక్, గౌతమ్, గాజర్ల రవి, భాస్కర్, ప్రయాగ్, కట్టా రామచంద్రారెడ్డి, కదిరి సత్యనారాయణరెడ్డి, హిడ్మా, గణేష్ మృతి చెందారు. దేవ్‌జీ, సోను, సతీష్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ప్రస్తుతం జార్ఖండ్‌కు చెందిన బెస్రా, తెలంగాణ చెందిన గణపతి, పసునూరి నరహరి అలియాస్ సంతోష్, వర్త శేఖర్ అలియాస్ మంగ్తు, జోడే రత్నబాయి అలియాస్ సుజాత, నక్క సుశీల అలియాస్ రేలా, రంగబోయిన భాగ్య అలియాస్ రూపి తదితరులు అజ్ఞాతంలో ఉన్నారు. గణపతి, ఆయన భార్య సుజాతతోపాటు మరొకరికి సంబంధించిన ఎలాంటి సమాచారం పోలీసుల వద్ద లేదని తెలిసింది. మిగతా ముగ్గురు మాత్రం లొంగుబాటు ప్రయత్నాల్లో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. దళ సభ్యులు, డీవీసీఎం ఇతర నాయకులు కలిసి మొత్తంగా 100 మందికిపైగా అజ్ఞాతంలో ఉన్నట్టు పోలీసులు అనుమాని స్తున్నారు. వీరంతా లొంగిపోయినా, పట్టుబడినా, ఎన్‌కౌంటర్లలో మరణించినాదేశం మావోయిస్టు రహితంగా మారుతుంది. వీరు లొంగిపోకపోతే ఎన్‌కౌంటర్లు చేస్తామని పోలీసులు చెబుతున్నారు.

**గణపతి లొంగిపోతే వైద్యం అందిస్తాం: డీజీపీ**

తమకు ఉన్న సమాచారం మేరకు గణపతి వయోభారం కారణంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఆయన జనజీవన స్రవంతిలోకి తిరిగి వస్తే రాష్ట్ర ప్రభుత్వం తరపున హైదరాబాద్‌లో తగిన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. అజ్ఞాతంలో ఉన్న ఇతర మావోయిస్టులంతా జనజీవన స్రవంతిలో కలవాలని సూచించారు.

## పేదింటి పండగ.. (మొదటిపేజీ తరువాయి)

కేంద్రాన్ని ఒప్పించి 2028 వరకు పొడిగించేలా చూశాం. ఇంటిపై సోలార్ ప్యానెళ్ల ద్వారా విద్యుదుత్పత్తి చేసుకునే పరిస్థితి తీసుకొచ్చాం. ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానెళ్లు పెట్టుకోవాలి. ఫైబర్‌నెట్ ప్రతి ఇంటికీ అందించాను. దీనిద్వారా వైఫై వచ్చేది. దాన్నీ నాశనం చేశారు. మళ్లీ కేంద్రంతో మాట్లాడి డబ్బు మంజూరు చేయించాను. త్వరలోనే ఇదీ పూర్తవుతుంది.”

**చట్టసభల్లోకి ఆడబిడ్డలు..**

“రాబోయే రోజుల్లో మగవాళ్లతో సమానంగా ఆడబిడ్డలు చట్టసభల్లోకి వస్తారు. ప్రతి ఇద్దరిలో ఒక ఆడబిడ్డ చట్టసభల్లో ఉంటుంది. తిరుపతి జిల్లాలో ఏడుగురిలో ఇద్దరు ముగ్గురు ఆడబిడ్డలకు చాన్స్ ఉంటుంది. ప్రజా సేవపై ఆసక్తి కలిగిన మహిళలకు స్వాగతం పలుకుతున్నాం. పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాది జూన్‌లో గోదావరి పుష్కరాల కంటే ముందే జాతికి అంకితం చేస్తాం. రాజ?ధానిపై మూడు ముక్కలాట ఆడారు. శాశ్వత పరిష్కారం కోసం అమరావతే రాజధాని అని తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. త్వరలోనే చట్టం వస్తుంది. అమరావతిని హైదరాబాద్, చెన్నై కంటే కూడా నంబరు వన్‌గా తయారు చేస్తాం.”

“పేదలకు మొదటి తేదీనే పింఛన్లు ఇస్తున్నాం. ఇక్కడున్న ముస్లిం మహిళను అడిగితే తన ముగ్గురు బిడ్డలకూ ‘తల్లికి వందనం’ వస్తోందని తెలిపారు. ఈ ఏడాది డ్వాక్రా సంఘాల్లోని 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచ ేయడం నా లక్ష్యం. ప్రస్తుతం రాష్ట్ర ఆదాయం నూటికి నూరుశాతం జీతాలకే సరిపోతోంది. కేంద్రం ఇచ్చే గ్రాంటు, వాటా అప్పులకు సరిపోతాయి. సంక్షేమ కార్యక్రమాలు అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది. ఆర్థిక వ్యవస్థను గత ప్రభుత్వం అస్తవ్యస్తం చేసింది. దీన్ని సరిచేయాలి. నాడు 13 నుంచి 14 శాతానికి వడ్డీకి తీసుకొచ్చారు. నేను వచ్చాక వడ్డీలు తగ్గించాం. ఎన్నిమార్గాలు వెతికినా, బరువు ఎక్కువగానే ఉంది. అయినా ఓటమిని ఒప్పుకోను. రాష్ట్రాన్ని బాగుచేసి.. మీ రుణం తీర్చుకుంటా.”

**వేంకటేశ్వరస్వామికి అపచారం...**

“ఒకప్పుడు తీవ్రవాదులు అడవుల్లో ఉండేవారు. ఇప్పుడు ఆ సమస్య తీరింది. నాపై 2003లో 23 క్లెమోర్‌మైన్లు పేల్చినా వేంకటేశ్వరస్వామి ప్రాణభిక్ష పెట్టారు. అలాంటి స్వామిని అప్రతిష్ఠపాలు చేయాలని, అపచారం చేయాలని కల్తీ నెయ్యి వ్యవహారాలను గత ప్రభుత్వంలో సాగించారు. అడిగితే ఎదురుదాడి చేస్తున్నారు.రాజకీయాల్లో 48 ఏళ్లు ఉన్నాను. 2028 నాటికి 50 ఏళ్లు. ఇన్నాళ్లలో నేనెప్పుడూ తప్పు చేయలేదు. అలాంటి నన్ను జైల్లో పెట్టారంటే ఇక మామూలు ప్రజల పరిస్థితి ఆనాడు ఎలా ఉండేదో ఊహించుకోండి.

**పేదల సొమ్మునూ నాడు వదల్లేదు**

“గత ప్రభుత్వంలో రూ.10 లక్షల కోట్ల అప్పు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల సొమ్మును ఇతర, సొంత అవసరాలకు మళ్లించారు. 25 శాతం కంటే తక్కువ నిర్మాణం జరిగిందంటూ.. లబ్ధిదారుల సంఖ్యను 2.61 లక్షల నుంచి 1.20 లక్షలకు కుదించారు. లబ్ధిదారులు కట్టిన రూ.174 కోట్లను తిరిగి ఇవ్వకుండా ఎగ్గొట్టారు. ఆ విషయం మంత్రి నా దృష్టికి తీసుకురాగానే, ఆ సొమ్మును 82 వేలమందికి అకౌంట్‌లో వేయాలని ఆదేశించా. కాంట్రాక్టరు బిల్లులు రూ.816 కోట్లు అప్పు పెట్టారు. దీంతో వారు పని నిలిపివేశారు. ఈ రోజు ఆ భారంగా అదనంగా రూ.3,109 కోట్లు అయింది. ఆ రోజు ఖర్చు చేసి ఉంటే ఇంత భారం పడేది కాదు. మరోపక్క రూ.12,173 కోట్లు రాష్ట్రానికి కేంద్రం ఇస్తే అందులో రూ.2,913 కోట్లు మళ్లించారు. కేంద్రం రూ.28 కోట్లు జరిమానం విధించినా...నాటి ప్రభుత్వానికి సిగ్గు రాలేదు”

## ఇరాన్ ఒప్పందానికి రాకుంటే ఖార్గ్‌ను పేల్చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)



అంతకుముందు అధ్యక్షుడి అధికారిక విమానమైన ఎయిర్‌ఫోర్స్ వన్ లో విలేకరులతో మాట్లాడుతూ.. ఇరాన్‌లో పాలనమార్పును సాధించినట్టు ట్రంప్ పేర్కొన్నారు. త్వరలోనే ఇరాన్‌తో ఒక ఒప్పందం కుదిరే అవకాశం ఉందని తాను భావిస్తున్నట్టు తెలిపారు. చర్చలు సానుకూలంగా సాగుతున్నాయనడానికి గుర్తుగా ఇరాన్ సోమవారం 20 పాకిస్థానీ చమురు నౌకలను హోర్ముజ్ గుండా వెళ్లడానికి అనుమతించిందని చెప్పారు. అలాగే.. ఫైనాన్షియల్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో.. ఇరాన్‌లోని చమురును స్వాధీనం చేసుకోవడమే తమ ప్రాధాన్యం అని.. ఖార్గ్‌ను తాము స్వాధీనం చేసుకోవచ్చు లేదా చేసుకోకపోవచ్చు అని ట్రంప్ పేర్కొన్నారు. ఇక.. ఇరాన్ సుప్రీం లీడర్‌గా నియమితులైన మొజ్తబా ఖమేనీ బతికే ఉన్నారో లేదో తమకు తెలియదంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో.. ఈ యుద్ధంలో తనకు అండగా నిలిచిన అత్యున్నత మతగురువులుకు, ఇరాన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ మొజ్తబా ఆదివారం ఒక సందేశాన్ని విడుదల చేశారు.

**ఇజ్రాయెల్‌కు అమెరికా మిలిటరీ బేస్‌లు?**

ఇరాన్ దాడిలో గల్ఫ్ దేశాల్లోని అమెరికా మిలిటరీ బేస్‌లన్నీ ధ్వంసం కావటంతో.. ఈ పరిణామాన్ని తనకు అవకాశంగా మలుచుకొనేందుకు ఇజ్రాయెల్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఖతార్, బహ్రెయిన్, యూఏఈ తదితర దేశాల్లోని బేస్‌లన్నింటినీ తమ దేశానికి తరలించాలని అమెరికాకు ఇజ్రాయెల్ విజ్ఞప్తి చేసినట్లు అమెరికా మీడియా పేర్కొంది. అందుకు అమెరికా అంగీకరిస్తే.. భవిష్యత్తులో ఇజ్రాయెల్‌కు సైనికపరంగా మరింత భద్రత లభిస్తుంది. ఇరాన్‌పై అమెరికా దాడికి ప్రతీకారంగా ఇరాన్ తన పొరుగున ఉన్న దేశాల్లోని అమెరికా మిలిటరీ స్థావరాలపై భీకరంగా దాడులు చేసింది. ఖతార్‌లోని అల్ ఉద్దెద్, బహ్రెయిన్‌లోని ఫిఫ్త్ ఫ్లీట్, యూఏఈలోని అల్ దఫ్రా బేస్‌లను మరింత సురక్షితమైన ప్రాంతాలకు తరలించాలని అమెరికా కూడా ఆలోచిస్తోందని, వార్తలు వెలువడుతున్నాయి.

## నిర్మలమ్మకు కనిపించని ప్రజా జీవిత వాస్తవాలు

ఈ నెల 1న లోక్‌సభలో 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తరువాత ఆ వార్షిక పద్దుపై ప్రభుత్వ ప్రతినిధులు, సంపాదకీయ రచయితలు, ఆర్థిక వ్యవహారాలపై వ్యాఖ్యాతలు, పాత్రికేయులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ 'జాగరూకత' అనే పదాన్ని, 'ఉన్న స్థితిని చెదరగొట్టి తలకిందులు చేయవద్దు' (డోంట్ రాక్ ది బోట్) అనే పదబంధాన్ని ఉపయోగించారు. భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను ఆర్థిక సర్వే 2025--26 గుర్తించింది; అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన సుంకాల సమరం భారత్ సరుకులపై విధించిన 50శాతం సుంకాలను 18శాతానికి తగ్గించనున్నట్టు ప్రకటించినప్పటికీ ఆ 'తగ్గింపు'నకు షరతులు ఉన్నట్టుగా కనిపిస్తోంది. భారత్‌కు అమెరికన్ ఎగుమతులపై నయాపైసా సుంకం విధించకపోవడం, సుంకాలేతర అవరోధాలను పూర్తిగా తొలగించడం, 50,000 కోట్ల డాలర్ల విలువైన అమెరికన్ ఉత్పత్తులను కొనుగోలు చేయడం మొదలైనవి. ఇంకా ఇతర షరతులు ఉండవచ్చు. అయితే ఈ షరతులను పాటించడం భారత్‌కు సాధ్యం కాకపోవచ్చు. దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావలసిన స్థాయిలో రావడం లేదు. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపుదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. నగదు సమృద్ధిగా ఉన్న భారతీయ వ్యాపారవేత్తలు మదుపు చేసేందుకు సంకోచిస్తున్నారు. పర్యవసానంగా 'స్థూల స్థిర మూలధన సంచయం' భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 30శాతంగా మాత్రమే ఉండిపోయింది. నామమాత్ర జీడీపీ వృద్ధిరేటు అసంతృప్తికరంగా ఉన్నది. జాతీయ గణాంకాల సంస్థ (ఎన్ఎస్ఓ) అనుసరించిన గణన పద్ధతులు, జాతీయ ఖాతాలపై అంతర్జాతీయ సంస్థల సందేహాలతో యథార్థ జీడీపీ వృద్ధిరేట్లపై అనుమానపు నీడలు కమ్ముకున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ నిజ స్థితిగతులను అంచనా వేసేందుకు నామమాత్ర జీడీపీ ఒక మంచి సూచకం. ఇది 2023--24, 2024--25, 2025--26 ఆర్థిక సంవత్సరాలలో వరుసగా 12శాతం, 9.8శాతం, 8శాతం మేరకు పెరిగింది. ఏమైనా వృద్ధి వేగాన్ని కోల్పోతోంది సుమా! నిరుద్యోగిత పెరిగిపోయింది. జూన్ 2025లో యువజనుల నిరుద్యోగిత రేటు 15శాతంగా ఉన్నది. దేశ శ్రామిక జనవాళిలో 21.7శాతం మంది మాత్రమే క్రమబద్ధమైన వేతన ఉద్యోగాలలో ఉన్నారు. లక్షలాది యువతీ యువకులు నిరుద్యోగులుగా ఉన్నారు. ఈ నిరుద్యోగులు స్వయం ఉపాధి వైపునకు మళ్లుతున్నట్టు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తయారీ రంగంలో అగ్రగామి కాకుండా ఏ దేశమూ మధ్య ఆదాయ దేశంగా రూపొందదు. భారతదేశ జీడీపీలో తయారీరంగం వాటా గత పది సంవత్సరాలుగా 15 లేదా 16 శాతంగా మాత్రమే ఉంటోంది. పీఎల్ఐ, ఇతర పథకాలు ఉద్యోగాలను సృష్టించడంలో విఫలమయ్యాయి; ద్రవ్య సమీకరణ బాధాకరంగా మందగించింది. ద్రవ్యలోటు 2025--26లో 4.4 శాతం నుంచి 2026--27లో 4.3శాతానికి తగ్గనున్నది. రెవెన్యూ లోటు 1.5శాతంగా ఉండిపోనున్నది. ఎఫ్ఆర్‌బీఎమ్ లక్ష్యాలను చేరుకునేందుకు 12 లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు పట్టవచ్చు. అందుకు మనం భారీ మూల్యమే చెల్లించనున్నాము. ప్రభుత్వ ఆర్థిక సలహాదారు, ఆర్థిక సర్వే మొదటి అధ్యాయంలోనే 'జాగ్రత్తగా ఉండాలి. అయితే నిరాశావాదం అవసరం లేదు' అని సూచించారు. ఈ ఆశావహ దృక్పథమే ఆ నివేదిక అంతటా కనిపించింది. మరో అధ్యాయంలో ప్రభుత్వం విశ్వసనీయమైన పద్ధతుల ద్వారా ప్రభుత్వ రుణాలను తగ్గించుకోవాలని, జీడీపీ--రుణాల నిష్పత్తిని కూడా బాగా తగ్గించుకోవాలని సూచించారు. పట్టణీకరణ విషయంలో మెట్రోపాలిటన్ పాలనా వ్యవస్థలను పటిష్ఠపరచాలని, సమృద్ధిగా నిధుల కేటాయింపులతో నగరాలకు ఆర్థిక సాధికారత కల్పించాలని పేర్కొన్నారు. పట్టణీకరణ విషయంలో ఆయన దృక్పథం సాహసోపేతంగా ఉందని చెప్పవచ్చు. 2025--26 ఆర్థిక సంవత్సరపు పన్నుల జూదం విఫలమయింది. గత ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ నుంచి డివిడెండ్ రూపంలో ఉదారంగా అందిన దాదాపు రూ.3,04,000 కోట్ల రూపాయలు బడ్జెట్‌లో అంకెలు ఘనంగా కనిపించేందుకు దోహదం చేశాయి. అంతకు ముందు రెండు ఆర్థిక సంవత్సరాలలో ఆర్బీఐ నుంచి ప్రభుత్వానికి డివిడెండ్‌గా వరుసగా రూ.2,10,874 కోట్లు, రూ.2,68,590 కోట్లు సమకూరాయి. యూపీఏ ప్రభుత్వాల హయాం (2004--14)లో రిజర్వ్ బ్యాంక్ నుంచి ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో సమకూరిన గరిష్ఠ మొత్తం (2013-14లో) రూ.52,679 కోట్లు. తన ప్రధాన సలహాదారు రూపొందించిన ఆర్థిక సర్వేకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిస్పందన అస్పష్టంగా ఉన్నది. తన 85 నిమిషాల బడ్జెట్ ప్రసంగంలో దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించిగానీ, సుంకాలు, నిర్బంధ వాణిజ్య ఒప్పందాల రూపేణా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ చేస్తోన్న ద్విముఖ దాడి గురించి ఆమె ఎటువంటి వ్యాఖ్య చేయలేదు! అంతకంతకూ మహా శక్తిమంతమవుతోన్న చైనా ఆర్థిక వ్యవస్థ గురించిగానీ, ఆర్థిక వ్యవహారాలపై మెరుగైన అవగాహన ఉన్నవారు బడ్జెట్ నుంచి ఆశిస్తున్న విషయాలపైగానీ ఆమె ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఆర్థిక మంత్రిగానీ, ప్రభుత్వంగానీ ఆర్థిక సర్వేను లెక్కలోకే తీసుకోలేదు-- ఇది నేను ఉదారంగా చేస్తున్న విమర్శ. 'మనం సౌర వ్యవస్థలోని ఒక గ్రహ వాసులమని ప్రస్తుత పాలకులు భావించడం లేదు' అనేది నేను నిర్దయగా చేసే విమర్శ. మందగించిన వృద్ధిరేటు, పేదరికం, పెరుగుతున్న అసమానతలు, పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, సంక్షేమంపై నిర్లక్ష్యం, రూపాయి విలువ తగ్గుదల మౌలిక సదుపాయాలు, అత్యవసర సేవల విషయంలో గిరాకీ, సరఫరాల మధ్య అంతరాలతో దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అనుసరించనున్న విధానాలు ఏమిటో ఆర్థికమంత్రి తన ప్రసంగంలో వెల్లడించకపోవడం నన్ను నిర్ఘాంతపరిచింది. నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగాన్ని ఆర్థికరంగ నిపుణులు తీవ్రంగా విమర్శించారు. భారత్-- ప్రపంచ నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని చెప్పుకుంటూ ప్రభుత్వం తనను తాను అభినందించుకోవడాన్ని డాక్టర్ సూర్జిత్ భల్లా ఎగతాళి చేశారు. వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడాన్ని డాక్టర్ అశోక్ గులాటి గర్హించారు. ఆర్థికమంత్రి తన ప్రసంగంలో అనేక పథకాలు, కార్యక్రమాలు, మిషన్‌లు, సంస్థలు, చౌరవలు, ఫండ్స్, కమిటీలను ప్రస్తావించారు.

# క్యాతనపల్లి మున్సిపాలిటీలో బహిరంగ దోపిడి..

### సీలింగ్ భూములను అనుమతుల పేరిట అమ్మేస్తున్నారా ?

**పత్రాలు చూడకుండా అనుమతుల పై సంతకాలు.. రెవెన్యూ శాఖను పక్కనపెట్టి మున్సిపల్ అధికారుల ఆటలు**

**సర్వే నం. 96/2 సీలింగ్ భూమిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణం ...**

**మున్సిపల్ అధికారులు ముడుపులకే పనిచేస్తున్నారా ?**



**మంచిర్యాల,మార్చి 30 (మన సమాజం) :** మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణ అనుమతుల వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారుతోంది. ఇష్టారాజ్యంగా అనుమతులు జారీ చేస్తూ, సీలింగ్ ప్రభుత్వ భూములపైనా నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో టీఎస్ బీ పాస్, ప్రస్తుతం "బిల్డ్ నౌ" వంటి వ్యవస్థల ద్వారా అనుమతులు ఇస్తున్నప్పటికీ, సంబంధిత డాక్యుమెంట్లను సమగ్రంగా పరిశీలించడంలో మున్సిపల్ శాఖ విఫలమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్యేకంగా, నిర్మాణ అనుమతుల కోసం సమర్పించిన పత్రాలపై రెవెన్యూ శాఖతో సమన్వయం లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. రెవెన్యూ శాఖను సంప్రదించకుండా, భూమి స్థితిగతులు నిర్ధారించకుండా అనుమతులు ఇవ్వడం వల్ల అక్రమ నిర్మాణాలకు మార్గం సుగమమవుతోంది. ఇప్పటికే క్యాతనపల్లి ప్రాంతంలో క్రైస్ట్ స్కూల్ పక్కన సీలింగ్ భూమిలో నిర్మాణం జరిగిన బహుళ అంతస్తుల భవనం విషయం వెలుగులోకి వచ్చింది. "మన సమాజం" పత్రికలో వార్తలు వెలువడిన తర్వాతే రెవెన్యూ, మున్సిపల్ శాఖలు స్పందించి నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేశాయి. అయితే అదే తరహాలో ప్రధాన రహదారి పక్కన మరోసారి సీలింగ్ భూమిలో నిర్మాణానికి అనుమతులు ఎలా ఇచ్చారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. క్యాతనపల్లి శివారు సర్వే నంబర్ 96/2 సబ్ డివిజన్‌లో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణంపై ఇప్పటికీ స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మున్సిపల్ శాఖకు ముడుపులు అందాయా? లేక అధికారుల నిర్లక్ష్యమే కారణమా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇకపోతే, కనీసం రెవెన్యూ శాఖ అయినా ఈ అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటుందా? లేక ఇది కూడా నిర్లక్ష్యపు బలవన్మరణంగా మారుతుందా? అన్నది ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. అక్రమ నిర్మాణాలు ఇలాగే కొనసాగుతాయా, లేక బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటారా అన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

## మత జాతీయవాదం భారత్‌కు మేలు చేసేనా?

'పాకిస్థాన్ తన ముస్లిమేతర పౌరులను ఎంతగా దురవస్థలకు గురి చేసినా మనం మన మైనారిటీ మతస్థులపట్ల నాగరీక రీతిలో వ్యవహరించాలి. మన అల్పసంఖ్యాక వర్గాలకు పూర్తి భద్రత కల్పించి, ఒక ప్రజాస్వామిక రాజ్యంలో పౌరులకు ఉండే హక్కులు అన్నిటినీ మన ముస్లిం మైనారిటీలకు ఇవ్వాలి'-- 1947 అక్టోబర్ 15న ముఖ్యమంత్రు లకు రాసిన లేఖలో ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఉద్ఘాటించిన మాటలవి. లౌకికవాదం, మైనారిటీ లకు సమానహక్కుల విషయంలో నెహ్రూ నిబద్ధతకు కాంగ్రెస్ పార్టీలోనే సంపూర్ణ ఆమోదం లేదు. స్వతంత్ర భారతదేశ తొలి సంవత్సరాలలోనూ, ఆ తరువాత తన జీవిత పర్యంతం కాంగ్రెస్‌లోనూ, విశాల భారతీయ సమాజంలోనూ మితవాద హిందూ శక్తుల ప్రభావాన్ని సమర్థంగా ప్రతిఘటించేందుకు ప్రధాని నెహ్రూ నిరంతరం కృషి చేశారు. ఆయన మరణానంతర దశాబ్దాలలో మాత్రమే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, భారతీయ జనసంఘ్, ఈ పార్టీ ప్రస్తుత అవతారమైన భారతీయ జనతా పార్టీ తమ ప్రభావ ప్రాబల్యా లను పెంచుకున్నాయి. దేశ విభజన అనంతరం భారత్ లౌకికవాద రాజ్యాంగాన్ని రూపొందించుకుని బహుళత్వ, సమ్మిళిత భారతదేశ నిర్మాణాన్ని లక్ష్యంగా ఔదలదాల్చింది. దేశ పాలనా వ్యవహారాలు మత ప్రమేయం లేకుండా జరిగేందుకు తొలి ప్రధాని నెహ్రూ సుస్థిర పునాదులు వేశారు.

అయితే మతాన్ని రాజ్య వ్యవహారాలతో మిళితం చేసిన మార్గాన్ని అనుసరించిన పాకిస్థాన్‌కు భారత్ ఇప్పుడు ఆ విషయంలో చేరువవుతోంది! మెజారిటీవాద ధోరణి ప్రస్తుత పాలకపక్షం వ్యవహా రాలలో స్పష్టంగా కనిపిస్తోంది. గత మూడు సార్వత్రక ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ తరఫున లోక్‌సభకు ఎన్నికైన 800 మందికి పైగా ప్రజా ప్రతినిధులలో ముస్లిం మతస్థులు ఒక్కరూ లేరు! నరేంద్ర మోదీ, అమిత్ షాల నాయకత్వంలో బీజేపీ హిందూ ఓటు బ్యాంకును సృష్టించుకో వడంలో చాలావరకు సఫలమయింది. హిందూ ఓటర్ల మద్దతు ఆధారంగా తరచూ ఎన్నికలలో విజయాలు సాధిస్తోంది. హిందువులకే ప్రథమ ప్రాధాన్యమిచ్చే రాజకీయాల అజెండా కేంద్రం లోనూ, రాష్ట్రాలలోనూ పదే పదే అధికారాన్ని కైవసం చేసుకునేందుకు తోడ్పడుతుం డడంతో సంఘ్ పరివార్ భారతీయ సమాజంలో తన ప్రభావ ప్రాబల్యాల నూ ఇతోధికంగా పెంపొందించుకుంటోంది. ఈ క్రమంలో భారతీయ ముస్లింలను (అప్పుడప్పుడూ భారతీ య క్రైస్తవులను కూడా) పలు విధాలా వేధింపులకు గురిచేస్తోంది. ఆ మైనారిటీ మతస్థుల పట్ల విద్వేషాన్ని ప్రోత్సహిస్తోంది. ముస్లింలు ఒకప్పుడు కేంద్ర కేబినెట్‌లో ప్రధాన మంత్రిత్వ శాఖ లకు సారథ్యం వహించారు. దౌత్య శ్రేణులకు, గూఢచార వర్గాలకు నాయకత్వం వహించారు. భారత ప్రధాన న్యాయమూర్తులుగా దేశ న్యాయపాలనను నిర్దేశించారు. భారత వాయుసేనకు అధినేతలుగా ఉన్నారు.

## తరచూ బీర్ తాగుతున్నారా..? ఎన్ని అనర్థాలు సంభవిస్తాయో తెలుసా..?



వీకెండ్ వచ్చిందంటే చాలు యువత ఎక్కువగా బీర్ తాగుతూ వీకెండ్ వైబ్స్ ను ఎంజాయ్ చేస్తూ ఉంటారు. బీర్ తాగడం సరదగా ఉన్నప్పటికీ ఇది మన ఆరోగ్యానికి గణనీయమైన హానిని కలిగిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. చాలా మంది బీరే కదా అని తేలికగా తీసుకుంటూ ఉంటారు. కానీ బీర్ లో కూడా ఆల్కహాల్ ఉంటుంది. ఇది మన ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. బీర్ తాగడం వల్ల పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోతుంది. ఎముకలు బలహీనంగా తయారవుతాయి. 35 సంవత్సరాలు దాటిన తరువాత ఎముకల సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మహిళలు బీర్ తాగడం వల్ల హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలు తలెత్తుతాయి. నెలసరి సమస్యలు రావడం, మానసి కపరమైన సమస్యలు రావడం జరుగుతుంది. పురుషులు బీర్ తాగడం వల్ల వారిలో ఛాతి పెరుగుతుంది. టెస్టోస్టెరాన్ స్థాయిలు తగ్గి ఈస్ట్రోజన్ స్థాయిలు పెరుగు తాయి. అంతే కాకుండా శరీరం శక్తి, పనితీరుతో పాటు ఆత్మవిశ్వాసం కూడా తగ్గుతుంది. బీర్ తాగడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య కూడా తలెత్తుతుంది. చాలా మంది బీర్ తాగుతూ ఎంజాయ్ చేస్తున్నామని భావిస్తూ ఉంటారు. కానీ బీర్ వల్ల మన ఆరోగ్యానికి కలిగే హాని గురించి ఎవరూ ఆలోచించరు అని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా బీర్ తాగడం వల్ల మూత్రవిసర్జన పెరుగుతుంది. దీంతో శరీరం డీహైడ్రేషన్ బారిన పడుతుంది. తలతిరగడం, తలనొప్పి, అలసట వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. బీర్ లో ఉండే ఆల్కహాల్ పేగులో ఉండే పొరలను చికాకుకు గురి చేస్తుంది. గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు అధికం అవుతాయి. ఆమ్లత్వం పెరగడంతో పాటు పొట్టలో పుండ్లు కూడా ఏర్పడతాయి. బీర్ ను అధికంగా తీసుకోవడం వల్ల కాలేయంపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. దీర్ఘకాలం పాటు బీర్ తాగడం వల్ల సిర్రోసిస్, ఫ్యాటీ లివర్, ఆల్కహాలిక్ హెపటైటిస్ వంటి కాలేయ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. కాలక్రమేణా మెదడు పనితీరు కూడా దెబ్బతింటుంది. అభిజ్ఞా పనితీరు క్షీణించడం, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. బీర్ తాగడం వల్ల గుండె ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుంది. గుండెపోటు, స్ట్రోక్ వంటి సమస్యలు వస్తాయి. కనుక బీర్ ను తీసుకోకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు. బీర్ తాగే అలవాటును ఒక్కసారిగా మానేయలేని వారు ఈ అలవాటును క్రమంగా తగ్గించుకునే ప్రయత్నం చేయాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. బీర్ వంటి ఆల్కహాల్ కలిగిన పానీయాలను ఆరు నెలల పాటు తీసుకోకపోవడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంలో పెద్ద మార్పులను చూడవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు. బీర్ ను మానేయడం వల్ల మనం అనేక ఆరోగ్యప్రయోజనాలను పొందవచ్చని మొత్తం శరీర ఆరోగ్యం మెరుగు పడుతుందని వారు చెబుతున్నారు.



## పర్వీన్ బాబీ బయోపిక్‌లో?

బాలీవుడ్ లెజెండరీ హీరోయిన్ పర్వీన్ బాబీ జీవితం ఆధారంగా బాలీవుడ్‌లో సినిమా రానున్నది. జోయా మెహ్రా తెరకెక్కించనున్న ఈ చిత్రంలో పర్వీన్ బాబీగా త్రిప్తి డిమ్రీ కనిపించనున్నది. పర్వీన్‌బాబీ జీవితంలోని గ్లామర్, వివాదాలు, వ్యక్తిగత పోరాటాలు.. వీటన్నింటినీ సమతుల్యంచేసి, అద్భుతమైన బయోపిక్‌గా ఈ చిత్రాన్ని తెరమీదకు తీసుకురావాలనే ప్రయత్నంలో మేకర్స్ ఉన్నారు. అయితే.. పర్వీన్‌గా త్రిప్తీని ఎంపిక చేయడంపై బాలీవుడ్‌లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గొప్పనటిగా కీర్తింపబడ్డ పర్వీన్‌బాబీ పాత్రకు త్రిప్తి న్యాయం చేయగలదా? అంటూ కొందరు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. ఈ డిబేట్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేటయింది. త్రిప్తి డిమ్రీపై మేకర్స్ మాత్రం పూర్తి నమ్మకంతో ఉన్నారు. త్వరలోనే సినిమా సెట్స్‌కి వెళ్లనుంది.

## యాక్షన్ డ్రామాగా హరుడు



శ్రీసీతారాముల కల్యాణం చూతము రారండి, శివరామరాజు వంటి హిట్ చిత్రాల్లో అలరించారు హీరో వెంకట్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'హరుడు'. రాజ్ తాళ్లూరి దర్శకుడు. ఈ చిత్రాన్ని మే 8న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. 'మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఇది. ప్రేక్షకులు కోరుకునే అన్ని అంశాలుంటాయి. హీరో వెంకట్‌కు తెలుగులో కమ్‌బ్యాక్ మూవీ అవుతుంది' అని మేకర్స్ అన్నారు. హెబ్బాపటేల్, సలోని, నటాషా, అలీ, సుమన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మని జీన్న, నిర్మాణ సంస్థ: వీఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్, నిర్మాతలు: లక్ష్మణ్‌రావు, ప్రవీణ్ రెడ్డి, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రాజ్ తాళ్లూరి.

## పడవ ప్రమాదంలో బెంగాలీ నటుడి దుర్మరణం



ప్రముఖ బెంగాలీ నటుడు రాహుల్ అరుణోదయ బెనర్జీ (42) పడవ ప్రమాదంలో దుర్మరణం చెందారు. టెలివిజన్ షో 'భోలే బాబా పర్ కరేగా' చిత్రీకరణలో భాగంగా ఒడిశాలోని తల్సరి బీచ్ వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. షూటింగ్ సమయంలో రాహుల్ బెనర్జీ పడవపై నుంచి అదుపు తప్పి సముద్రంలో పడిపోయారు. వెంటనే అప్రమత్తమైన సినిమా యూనిట్ ఆయన్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ప్రమాద కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు బాలాసోర్ పోలీసులు తెలిపారు.

## జీవితాన్ని ప్రతిబింబించే 'కర్మేని సెల్వం'



'కుటుంబ భావోద్వేగాలతో కూడుకున్న కథ 'కర్మేని సెల్వం'. సంగీత దర్శకునిగా నా కెరీర్‌కి ఈ సినిమా ఓ టర్నింగ్ పాయింట్. ఈ సినిమా మ్యూజిక్ ఇంతబాగా రావడానికి కారణం టీమ్ వర్క్' అని సంగీత దర్శకుడు రామానుజన్ ఎంకే అన్నారు. సముద్రఖని ప్రధాన పాత్రలో రూపొందిన ద్విభాషా చిత్రం 'కర్మేని సెల్వం'. గౌతమ్ వాసుదేవమీనన్ కీలక పాత్ర పోషించారు. రామ్‌చక్రి దర్శకుడు. అరుణ్ రంగరాజులు నిర్మాత. ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంగీత దర్శకత్వం వహించిన రామానుజన్ చిత్ర విశేషాలను వెల్లడించారు. ఇంకా చెబుతూ 'భావోద్వేగపూరితమైన కథలకు సంగీతం అందించడం కష్టం. సముద్రఖని, గౌతమ్ మీనన్, దర్శక,నిర్మాతలు.. ఇలా అందరూ సపోర్ట్ చేయడం వల్లే ఇది సాధ్యమైంది. 'కర్మేని సెల్వం' మనసులకు హత్తుకునే సినిమా. ప్రతి ఒక్కరి జీవితాలను ప్రతిబింబిస్తుంది' అని తెలిపారు రామానుజన్. తెలుగులో ఆనంద్, హ్యాపీడేస్, గోదావరి వంటి ఫీల్‌గుడ్ సినిమాలకు సంగీతం అందించాలనేది తన డ్రీమ్ అని ఈ సందర్భంగా రామానుజన్ చెప్పారు.

## జేజమ్మగా శ్రీలీల?

2009లో 'అరుంధతి'గా బాక్సాఫీస్ వద్ద అనుష్క చేసిన హంగామా అందరికీ తెలిసిందే. అనుష్కను నేటికీ అంతా జేజమ్మ అని ముద్దుగా పిలుచుకుంటారు. ఆమె ఇమేజ్‌పై ఆ పాత్ర ప్రభావం అలాంటిది. సినిమా వచ్చి 17 ఏండ్లయినా గద్వాల్ రాణిగా అనుష్క కనపరచిన రాజసం ఎవరూ మరిచిపోలేదు. అలాంటి ఈ సినిమాను బాలీవుడ్‌లో పునర్నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. టాలీవుడ్ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ నిర్మించనున్న ఈ చిత్రంలో 'అరుంధతి'గా శ్రీలీల నటించనున్నట్టు సోషల్ మీడియాలో వార్తలొస్తున్నాయి. తమిళ దర్శకుడు మోహన్‌రాజాను దర్శకుడిగా పరిశీలిస్తున్నారట. ఇదిలావుంటే.. అసలు జేజమ్మ పాత్రకు శ్రీలీల న్యాయం చేయగలదా? అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో ఉత్పన్నమవుతున్నాయి. రీమేక్ చేసే బదులు, సీక్వెల్ చేస్తే బావుంటుందని మరికొందరు నెటిజన్స్ సలహాలు కూడా ఇస్తున్నారు. అసలు ఈ వార్తలో నిజం ఎంతుందో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

